డా॥ వేదగిరి రాంబాబు

# బుజ్జికథలు



# CONTENTS




1. ముందుమాట 3
2. గుణపాఠం 4
3. మార్పుకు మూలం 6
4. పొగడ్త కాదు కావలసింది 8
5. దేని ఉపయోగం దానిదే 10
6. దిన దిన గండం 12
7. తీరిన కోరిక 14
8. కుబేర ప్రశ్న 16
9. గట్టెక్కిన గండం 18
10. న్యాయం కోసం 20
11. అత్యాశ 22
12. విమర్శ 24
13. కష్టాలకి కారణం 26
14. తెలివి 28
15. డబ్బు విలువ 30
16. సంతోషం 33
17. అతి విలువైనది 35
18. గర్వ భంగం 37

19. దేవుడి లీల 39

20. ప్రేమ 42

21. రొట్టె! రొట్టె! ఎక్కడికెళ్తున్నావ్? 44

22. ధైర్యే సాహసే లక్ష్మి 47

23. కష్టే ఫలి 49

24. కుక్క తెలివి 51

25. కత్తి ఉపయోగాలు 53

26. నైజం 55




# 1. ముందుమాట

ఇవి బుజ్జి కథలు... బుజ్జి పిల్లల కథలు... బుజ్జి పిల్లలకోసం కథలు... బుజ్జి పిల్లల ఆలోచనా విధానం ఇలా ఉంటే బాగుంటుందని నేను రాసుకున్న కథలు.

ల సాహిత్యం బాలల్లో మంచి ఆలోచనలకు బీజం వేయాలన్నది నా ఆశ. ఆ ఆశ ఆశయసిద్ధికోసం, మీకోసం ఈ కథలు రాశాను. మీరందరూ చదవాలి. నేను కోరిన బీజాలు మీలో మొలకెత్తాలి.

అప్పట్లో చొక్కాపు వెంకటరమణ అన్నయ్య కోరితే మీ లాంటి పిల్లల కోసం రాశాను. బాలచంద్రిక , బాలల అకాడమీ పత్రికలో ప్రచురిత మయ్యాయి. వాటిలో 150 కథల్ని బాలల అకాడమీ 'చిన్ని కథలు'గా తీసుకొచ్చింది. ఇప్పుడు 25 కథలతో ఈ 'బుజ్జి కథలు' వచ్చింది.

చదివి, ఇలాంటి కథలు మీరూ చెప్పడానికి ప్రయత్నించండేం... ఉంటాను.

మీ

-వేదగిరి రాంబాబు

1-3-2016



పాటలీపుత్రాన్ని దిలీపుడు అనే రాజు పరిపాలిస్తున్న రోజులవి. దిలీపుడు చాలా మంచి రాజు. అయితే మాత్రం లాభమేమిటి? రాజోద్యోగులందరూ లంచగొండులు. రాజుకి తెలీకుండా ప్రజలని పీడించసాగారు.

ఒకరోజు తన తోటలో పండిన పళ్ళబుట్టని తీసుకుని రాజుగారి దగ్గరకు బయల్దేరాడు ఓ ముసలాయన. తన ఆర్థిక పరిస్థితిని రాజుకి వివరించి ఏదైన సాయాన్ని పొందాలని ఆయన ఆలోచన.

తన దగ్గరున్న పళ్ళన్నింటినీ పట్టుకెళ్లినా రాజుకి ఇవ్వడానికి అంతగా బాగుండదు. అట్లాంటిది రాజుని చూడాలంటే రాజోద్యోగులకు లంచం ఇవ్వాలి. ఎలా? అయినా ధైర్యం చేసి బయల్దేరాడు.



అతను అనుకున్నట్లుగానే 'రాజు నీకిచ్చిన బహుమతిలో నాల్గోవంతు ఇస్తానంటేనే నిన్ను లోపలికి పోనిస్తాము' అంటూ నాలుగుద్వారాల దగ్గర ఎదురైన కాపలాభటులు అతన్ని అడ్డగించారు. అందుకు ఒప్పుకునే రాజువద్దకు వెళ్ళాడు ముదుసలి.

అంతటి వృద్ధాప్యంలో కూడా ప్రేమతో ఆ ముదుసలి పళ్ళని తెచ్చేసరికి పరమానంద భరితుడయ్యాడు దిలీపుడు.

''మీకు ఏం కావాలి?'' అని అడిగాడు.

''ఓ ఇరవై కొరడా దెబ్బలు ఇప్పించండి'' వినయంగా అడిగాడు ముసలాయన.

''అదేమిటి?'' ఆశ్చర్యంగా అడిగాడు దిలీపుడు.

''మరేమి చెయ్యను చెప్పండి. మిమ్మల్ని చూడడానికి వస్తుంటే మీరిచ్చే బహుమతిలో నాల్గోవంతు తమకిస్తేనే లోపలికి పంపుతామంటూ నాలుగు ద్వారాల దగ్గరా నలుగురు కాపలావాళ్ళూ అడ్డగించారు. వాళ్ళ నలుగురికి నాలుగుభాగాలు ఇస్తే నాకు మిగిలేదేముంటుంది? అందుకే నాకు బహుమానంగా ఇరవై కొరడాదెబ్బలని ఇస్తే వాటిని వాళ్ళకు పంపుదామని ఆలోచిస్తున్నాను'' అన్నాడు.

దిలీపుడికి విషయం పూర్తిగా అర్థమైంది. ఉద్యోగులలో ఉన్న లంచగొండితనాన్ని అణచడమే తన తక్షణ కర్తవ్యమని తలచాడు.

నలుగురు కావలివాళ్ళనీ పిలిపించి ఒక్కోడికి అయిదేసి దెబ్బలు ఇప్పించాడు. అంతటితో ఊరుకోకుండా, పనిలోనుంచి తొలగించాడు. తనకు పాలనా విషయం గురించి హెచ్చరించిన ఆ ముదుసలిని ఘనంగా సత్కరించాడు.

ఆ రోజునుంచీ దిలీపుడు లంచగొండులకి సింహస్వప్నమయ్యాడు.



చాలాకాలం క్రిందట జరిగిన కథ ఇది.

అప్పట్లో అదో చిన్న ఊరు.

ఆ ఊళ్ళో ఉన్న అందరూ స్వార్థపరులే... ఓ ముసలి జంట తప్ప! అందుకనే అందరి మధ్యా బ్రతకలేక ఆ ముసలి దంపతులు ఊరికి దూరంగా ఓ చిన్న కుటీరాన్ని నిర్మించుకుని, అందులో నివసించసాగారు.

ఒక రోజు ఇద్దరు కొత్త మనుషులు ఎక్కడినుంచో పోతూ ఆ ఊళ్ళో ఆగారు. కానీ ఆ ఊరి మొత్తంలో ఎవ్వరూ వాళ్ళకి పచ్చి మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు. పైగా గేలిచేసి, తరమసాగారు.

కాలే కడుపులతో ఊరు చివరికి చేరిన వాళ్ళకి అక్కడ కుటీరం కనిపించింది. ఆశగా అటు వెళ్ళారు.



వాళ్ళని చూస్తూనే లోపలికి రమ్మని ఆహ్వానించాడు నారాయణస్వామి. ఆయన భార్య రుక్మిణమ్మ చిక్కటి పాలని తెచ్చి ఇచ్చింది.

పాలని తాగిన తర్వాత పోతున్న ప్రాణం నిలిచినట్లనిపించింది అతిథులకి. వాళ్ళ పరిస్థితిని అర్థం చేసుకున్నారు ముసలిదంపతులు. అందుకని తమ కోసం తయారుచేసుకున్న కొద్దిపాటి ఆహార పదార్థాల్నీ వాళ్ళకి పెట్టారు.

అతిథులకి కొద్దిగా తిన్న తర్వాత ఆకలి ఇంకా ఎక్కువైనట్లనిపించింది. మరి కొద్దిగా వడ్డించమని రుక్మిణమ్మ అడిగారు.

ఆమెకి పై ప్రాణం పైనే పోయింది. ఎందుకంటే గిన్నెలనన్నింటినీ ఖాళీచేసి వాళ్ళకి పెట్టింది. ఇంక ఇంట్లో ఏమీ లేదు! ఆమాటే బాధపడుతూ వాళ్ళకి చెప్పింది.


''లేదమ్మా... మీ వంటపాత్రలు చూడండి. వాటిలో ఇంకా ఆహారపదార్థాలున్నాయి'' అన్నాడు అతిధులలో పెద్దాయన.

ఆశ్చర్యం! లోపలికి వెళ్ళి పాత్రలలోకి చూసేసరికి ఆహారపదార్థాలు లేవుగాని వాటి నిండా బంగారు నాణేలున్నాయ్! బయటకు వచ్చి చూసేసరికి ఇద్దరు కొత్త మనుషులూ లేరు!

అర్థమైపోయింది వాళ్ళకి- వాళ్ళిద్దరూ దేవతా పురుషులై ఉంటారని! వాళ్ళాకలి అనేసరికి తమకి ఉన్నది కాస్తా పెట్టేసరికి ఆనందించి ఇలా దీవించి వెళ్ళిపోయుంటారని!

ఆ విషయం తెలుసుకున్న ఆ ఊళ్ళోని అందరిలోనూ మార్పు వచ్చింది. అందరిలోనూ దయాదాక్షిణ్యాలు ఎక్కువయ్యాయి.

©$®



మాళవరాజ్యాన్ని సమర సింహుడు పరిపాలిస్తున్న రోజులవి. ప్రజల బాగోగుల్ని స్వయంగా పరిశీలించేవాడాయన.
అందరికీ ఆయనంటే విపరీతమైన భయభక్తులుండేవి.

కొలువులో వున్నవాళ్ళు ఆయన నోటివెంట ఏ మాట వచ్చినా 'అమోఘం, అద్భుతం' అంటూ పొగిడేసేవారు. ఎవ్వరూ రాజుకి సలహా ఇచ్చేవారు కారు.

తన కొలువులో ఉన్నవాళ్ళ ఈ ముఖస్తుతి ప్రవర్తనని మార్చాలని సమరసింహుడు ఎన్నో విధాల ప్రయత్నించాడు. అయినా వాళ్ళలో మార్పులేదు.

ఒకరోజున రాజు తన పరివారంతోసహా సముద్రపు ఒడ్డుకి వెళ్ళాడు. అలలు తన కాలికి



తగిలేటట్లు సింహాసనం వేయించుకుని కూర్చున్నాడు.

''నా మాటని ఎదిరించేవారెవ్వరూ లేరుగా?'' ధీమాగా ప్రశ్నించాడు సమరసింహుడు.

''లేరు...'' అందరూ మూక ఉమ్మడిగా జవాబిచ్చారు ''మీ మాటే వేదవాక్కు. దానికి తిరుగులేదు'' అని కూడా జవాబిచ్చారు.

వెంటనే సమరసింహుడు ''ఓ సముద్రం! వెంటనే నీ అలలని, లోపలికి తీసేసుకో. బయటికి ఒక్కటి కూడా రావడానికి వీల్లేదు'' అన్నాడు గంభీరంగా.

అలలు మామూలుగానే సమరసింహుడి కాళ్ళ దాకా వస్తున్నాయి. వెళ్తున్నాయి. ఇంతలో ఓ పెద్ద అలవచ్చి ఆయన ముఖానికి తగిలింది.

అందరూ బిక్కు బిక్కు మంటు చూడసాగారు.

సమరసింహుడు గట్టిగా నవ్వాడు ''నామాట ఈ సముద్రం ఎందుకు వినలేదు? నా మాట విని నీళ్లని లోపలికి లాగేసుకుంటే ఎన్నో నష్టాలున్నాయి కాబట్టి. అలాగే మీరు కూడా నా మాటలు సక్రమమైన వయితేనే పాటించాలి. లేకపోతే సరయిన సలహాలు ఇవ్వాలి. అందుకే మీరంతా ఉన్నది'' అన్నాడు.

అలాగేనన్నట్లు తలలూపారు అందరూ.

ఈ విధంగా వాళ్ళలోఉన్న ఆ జాడ్యాన్ని పోగొట్టి అందరి సలహాలతో సక్రమంగా రాజ్యాన్ని పరిపాలిస్తూ, అందరిచేతా మంచి మహారాజుగా కీర్తింపబడ్డాడు సమరసింహుడు.



ఆరోజు రాము, సోములని తీసుకుని ఆంటీ అరుణ పిక్నిక్‌కి బయలుదేరింది.

పిల్లలిద్దరినీ సెలవురోజూ ఆలా తోటవేపు తీసుకువెళ్ళి కాసేపు సరదాగా వాళ్ళతో గడపాలని ఆమె కోరిక. ఆమెతో పాటు వెళ్ళి తోటలో ఇంచక్కా ఆంటీ తెచ్చే తినుబండారాలని తినాలని రాము, సోము కోరిక.

మొత్తానికి ముగ్గురూ కలిసి బయలుదేరారు. రాము, సోము తినుబండారాల బుట్టని నేను పట్టుకుంటానంటే, నేను పట్టుకుంటానని పోట్లాడుకోసాగారు.

ఆంటీ వాళ్ళిద్దరినీ సమాధానపరచి రామూని బుట్టని పట్టుకొమ్మని, సోముని తన చేతిలో ఉన్న గొడుగుని పట్టుకొమ్మంది.

రామూ మొహంలో విజయకళ తొంగిచూసింది. సోమూ మౌనంగా తలవంచుకుని ఆంటీ



వెనక నడవసాగాడు.

''సోమూ! నువ్వు పట్టుకున్న వస్తువూ అంత పనికిరానిదేమీ కాదు. దాని ఉపయోగాలూ ఎన్నో ఉన్నాయి..'' సోముని ఓదారుస్తూ అంది ఆంటీ.

సోమూకి ఆంటీ మాటలు అంతగా రుచించలేదు. అయినా బదులు పలుకకుండా నడవసాగాడు.

ముందు తినుబండారాల బుట్టతో రాము, వెనుక ఆంటీ - పక్కనే సోమూ... నడుస్తూ తోటని చేరుకున్నారు.

తోటలో ఓ చిన్న కాలువ పక్కకి చేరి కూర్చున్నారు ముగ్గురూ.

ఇంతలో ఆంటీ ''మొహం, కాళ్ళు కడుక్కొని నేనిప్పుడే వస్తాను. తినుబండారాలని ఏవీ ముట్టుకోకుండా చూస్తూ ఉండండి...'' అని రాము, సోములకి చెప్పి కాలువ వేపు వెళ్ళింది.

ఆమె వెళుతున్న వేపే చూస్తున్న రాము, సోములకి ఆ నీటిలో అరుస్తూ తిరుగుతున్న బాతులు కనిపించాయి. వాటిని దగ్గరగా చూడాలనే ఆత్రంతో వాళ్ళిద్దరూ కూడా కాలువ వేపు వెళ్ళారు. అక్కడే నిలబడి బాతుల్ని గమనించసాగారు.

ఇంతలో పక్కన 'దబ్' మనే శబ్ధం వినిపించి రాము, సోము పక్కకి తిరిగారు. తినుబండారాల బుట్ట నీళ్ళలో పడిపోయింది. తేలుతూనే ముందుకు వెళ్ళిపోతోంది.

ఒడ్డు నుంచి పట్టుకోవడానికి అందడంలేదు.

రాము అలా చూస్తూ నిల్చుండిపోయాడు.

సోమూ తన చేతిలో ఉన్న గొడుగు కొక్కెంతో తినుబండారాల బుట్టని ముందుకు లాగాడు. రామూ దాన్నందిబుచ్చుకుని బయటకు తీశాడు.

ఇంతలో అక్కడికి వచ్చిన ఆంటీ ''చూశారా! ఇవాళ ఆ గొడుగు లేకపోతే ఆ తినుబండారాలు మనకందేవా? మరికాసేపట్లో నీళ్ళు బుట్టలోకి పోయి తినుబండారాలన్నీ పాడైపోయేవి.ఏదీ నిరుపయోగంకాదు. సమయానికి వాడుకోవడంబట్టి ఉంటుంది''. అంది

అప్పుడు ఆ విషయం పిల్లలిద్దరికీ తెలిసివచ్చింది.



అవంతీపురాన్ని సురవర్మ పరిపాలిస్తున్న రోజులవి. సురవర్మ అంటే శత్రువులకి సింహస్వప్నంగా ఉండేది.

అతను ధైర్యవంతుడేగాదు చాలా ధనవంతుడు కూడా! ఎవర్నీ ఒక పట్టాన నమ్మేవాడు కాదు. తన ధనాగారాన్ని పెంపొందించుకునే ప్రయత్నంలోనే ఎప్పుడూ వుండేవాడు. అందుకనే అతనికి శత్రువులు ఎక్కువగా వుండేవారు. తన ప్రాణరక్షణకి ఎప్పుడూ కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసుకొంటూనే వుండేవాడు.

సురవర్మ విద్య నభ్యసించే రోజుల్లో రవికాంతుడు కూడా అదే గురువు దగ్గర విద్యాభ్యాసము చేసేవాడు. సురవర్మ రాకుమారుడు కావడంతో రాజయ్యాడు. రవికాంతుడు సాధారణ మనిషిగానే



ఉండిపోయాడు.

కానీ ఇద్దరూ కలుసుకునక్నప్పుడల్లా రవికాంతుడు, సురవర్మ రాజభోగాలను పొగుడుతూనే వుండేవాడు. సురవర్మ మాత్రం ''ఈజీవితంలోని బాధలు నీకు తెలీవు'' అంటూండేవాడు. రవికాంతుడు ఆ అభిప్రాయంతో ఏకీభవించేవాడు కాదు. ''నీ జీవితం లాంటి జీవితం ఒకరోజు అనుభవిస్తే చాలు జన్మ ధన్యమైపోతుంది'' అనేవాడు.

సరే, ఆ రోజు సురవర్మ రవికాంతుడితో తన జీవితాన్ని ఒకరోజు అనుభవించమన్నాడు.రవికాంతుడు వప్పుకున్నాడు. సురవర్మ తన సేవకు లందర్నీ పిలిచి ఈరోజుకి రవికాంతుడు ఎలా చెబితే అలా చెయ్యమన్నాడు.

రవికాంతుడు అందరిమీద అజమాయిషీ చెలాయించసాగాడు. ఇష్టంవచ్చినట్లు తినడం, తాగడం చేసాడు. అలసిపోయి శయనాగారం చేరుకుని పడకమీద నడుం వాల్చాడు. మైకంతో వాలిపోతున్న కళ్ళని బలవంతంగా తెరిచి చూసాడు.

అంతే! ఒక్కసారి అతని గుండె ఝల్లుమంది.

పైన గుర్రపు వెంట్రుకకి వ్రేలాడుతున్న పదునైన కత్తి కిందపడితే? భయంతో వణికిపోయాడు.

ఎప్పుడూ అప్రమత్తంగా వుండడం కోసం సురవర్మే ఆ ఏర్పాటు చేసుకున్నాడు.

మత్తు వదిలిపోయింది. ఛెంగున పక్కమీద నుంచి దూకి బయటికి పరుగెత్తసాగాడు.

ఇంతలో సురవర్మ ఎదురొచ్చి అతన్ని పట్టుకున్నాడు.

''శయనాగారంలో పక్క పైన కత్తి..'' రవికాంతుడు వణికిపోతూనే చెప్పాడు.

''అదా'' సురవర్మ నవ్వాడు. ''నేనెన్ని భోగాలనుభవిస్తున్నా నా తలమీద ఎప్పుడూ కత్తి వుంటుంది. చాలా జాగ్రత్తగా వుండాలి సుమా! అని నాకు గుర్తుచేస్తుంటుంది'' అన్నాడు మళ్ళీ.

''బాబూ! ఒక్కరోజు కాదు గదా ఒక్క గంట కూడా నాకీ కత్తిమీద సాములాంటి జీవితం వద్దు. వస్తా'' అంటూ గబగబా వెళ్ళిపోయాడు సురవర్మ, పిలుస్తున్నా వినిపించుకోకుండా.



దిలీపుడు ఓ సామాన్యుడు.  చక్రవర్తి కూతురంటే అతనికి ఇష్టం. కానీ వాళ్ళ వివాహానికి చక్రవర్తి ఎలా ఒప్పుకుంటాడు? రాకుమార్తెకు తన ఇష్టాన్ని తెలియజెయ్యడం ఎలా? ఈ సమస్యలతో సతమతమై పోసాగాడు.

దిలీపుడి తండ్రి ఓ గమ్మత్తయిన గులాబీచెట్టుని వేశాడు. అది ఇరవై సంవత్సరాలకి ఒక పువ్వుని మాత్రమే పూస్తుంది. ఆ పువ్వునించీ వచ్చే సుగంధ పరిమళం మనసులో వున్న చిరాకులనన్నింటినీ త్రుటిలో పోగొట్టేయగలదు. అంతేకాకుండా అతని దగ్గర ఓ పక్షి వుంది. చాలా గొప్పగా పాడగలదది.

ఒకరోజున అటుగా రథంలో వెళ్తున్న రాకుమార్తె దిలీపుని గులాబీ వాసనకి తన్మయురాలైంది.



ఆ చెట్టుని తమ ఉద్యానవనంలోకి తరలించుకు రమ్మని చెలికత్తెలని పంపింది.

''ఆ చెట్టు రాకుమార్తెకు కావాలి. ఎంతివ్వమంటావ్?''అని వాళ్ళు వచ్చి దిలీపుని అడిగారు.

''రాకుమార్తెతో పది నిముషాలు మాట్లాడనిస్తే చాలు'' చటుక్కున జవాబిచ్చాడు దిలీపుడు.

చెలికత్తెలు అతని ధైర్యానికి ఆశ్చర్యపోయారు. కోపంతో ఆ విషయాన్ని రాకుమార్తెకి చెప్పారు

''ఎంత ధైర్యం'' అని మండిపడింది రాకుమారి.

''పది నిముషాలు తనతో మాట్లాడనిస్తేనే ఆ చెట్టుని ఇచ్చేది'' ఖచ్చితంగా చెప్పేసాడు దిలీపుడు.

ఆ చెట్టుని వదిలి వెళ్ళిపోలేక పోయిన రాకుమారికి అతని కోరిక తీర్చక తప్పలేదు.

ఎవ్వరికీ కనిపించకుండా చుట్టూ చెలికత్తెలందరూ నిలబడుంటే రాకుమార్తె దిలీపుడితో పది నిముషాలు మాట్లాడింది. ఆ వింత గులాబీచెట్టుని తీసుకుపోబోయింది.

''ఓ రాకుమార్తే! దీనికోసం ఓ సామాన్యుడితో మాట్లేడేట్లు చేయడంకన్నా దీని సువాసన గొప్పదా?'' అన్నాడు దిలీపుడు నవ్వుతూ.

గులాబీ చెట్టుని తెచ్చుకున్నా రాకుమార్తెకు దిలీపుడి నవ్వు పదే పదే గుర్తుకు రాసాగింది. కానీ, గులాబీ చెట్టులాగే దిలీపుణ్ణీ తెచ్చుకోలేదుగా? అందుకని దిగులు పడిపోసాగింది.

ఈ విషయం తెలిసిన దిలీపుడు రాకుమార్తెని చూడడంకోసం తన ప్రాణాలు ఫణంగా పెట్టి బయల్దేరాడు. రాజమందిరంలోకి ప్రవేశించాడు.

అతడిని చూడగానే రాకుమార్తె ముఖం వెలిగిపోయింది.

అది గ్రహించిన రాజు దిలీపుడి వీరోచితానికి కూడా మెచ్చి, అతడికి రాకుమార్తెనిచ్చి పెళ్ళిచేసేడు. అలా అతనికోరిక నెరవేరింది.

అంతేకాదు, రాజు తదనంతరం దిలీపుడు రాజై ప్రజల్ని కన్నబిడ్డల్లా  చూసుకుంటూ రాజ్యపాలన చేశాడు.



పాండవుల అజ్ఞాతవాసం ముగిసింది. కౌరవులతో మంతనాలు ఫలించలేదు. యుద్ధం తప్పనిసరి అయ్యేట్టు కనిపిస్తోంది. ధర్మరాజు దగ్గర డబ్బులేదు. యుద్ధం చేయాలంటే డబ్బు తప్పనిసరి కదా! అందుకని ధనాధిపతి అయిన కుబేరుడి దగ్గరకు సహదేవుణ్ణి అప్పుకోసం పంపించాడు.

సహదేవుడు కుబేరుడి దగ్గరికి వెళ్ళి డబ్బు అడిగాడు. కుబేరుడు సహదేవుణ్ణి ఒక ప్రశ్న వేశాడు. ''నేను మీకు డబ్బు అప్పుగా ఇస్తాను. అప్పుడు నీవు ఎంతో సంతోషిస్తావు. అవునా?''

''అవునూ'' అన్నాడు సహదేవుడు.

''అంతే సంతోషంతో నీవు నా అప్పు తీర్చగలవా?'' అని ప్రశ్నించాడు కుబేరుడు.



''తప్పకుండా'' అన్నాడు సహదేవుడు.

కుబేరుడు సహదేవుడికి డబ్బు ఇవ్వలేదు. ఉత్తి చేతులతోనే సహదేవుడు వెనక్కి వచ్చాడు.

ధర్మరాజు నకులుణ్ణి పంపించాడు. కుబేరుడు అవే ప్రశ్నలే అతడినీ వేశాడు. నకులుడు కూడా సహదేవుడు చెప్పినటువంటి జవాబుల్నే చెప్పాడు. అర్జునుణ్ణి, భీముణ్ణి పంపించాడు ధర్మరాజు. నకుల సహదేవులలాగానే వారూ చెప్పి తిరిగి వచ్చారు.

చివరికి ధర్మరాజే కుబేరుడి దగ్గరికి వెళ్ళాడు. కుబేరుడు మళ్ళీ అదే ప్రశ్న వేశాడు.

''నేను నీకు అప్పు ఇస్తాను. అప్పుడు నీవు సంతోషిస్తావు. కానీ, అప్పు తీర్చేటప్పుడు అదే సంతోషంతో తిరిగి ఇవ్వగలవా?''

అప్పుడు ధర్మరాజు ఇలా జవాబు చెప్పాడు.

''ఓ కుబేరా! అదెట్లా సాధ్యం? అప్పు దొరికినప్పుడు ఆపద తీరిపోయినందుకు సంతోషంగా ఉంటుంది. మళ్ళీ అప్పు తీర్చడమంటే మళ్ళా ఆపదవచ్చినట్లే! అప్పుడు సంతోషంగా ఉండడం ఎట్లా సాధ్యం? మానవ ప్రవర్తన విచిత్రమైనది.''

కుబేరుడు ఆ సమాధానానికి సంతృప్తి చెందాడు. అవసరమైనంత డబ్బును ధర్మరాజుకి అప్పుగా ఇచ్చాడు.

©$®



విజయుడు ఇంద్రజాలాన్ని చేసి సొమ్ము సంపాదించుకుంటుండే వాడు. అతని ఇంద్రజాలం గురించి రాజుకు కూడా తెలిసిపోయింది.

కాని అందరూ అతనికి నిజముగా మాయలు, మంత్రాలు తెలుసునేమోనని భ్రమించసాగారు.

ఒకరోజున రాజుగారి భోజనశాలలో వున్న వెండిపళ్ళాలన్నీ మాయమయ్యాయి. ఇది విజయుడి పనే అయి ఉంటుందని రాజు అనుమానించాడు. వెంటనే అతన్ని రప్పించాడు. మూడురోజుల్లో వాటిని వెనక్కి తెప్పించకపోతే ఉరి తీసేస్తానని బెదిరించాడు. భటులతో అతన్ని ఓ చీకటి కొట్లో బంధింపజేశాడు.

విజయుడు భయంతో వణికిపోసాగాడు. మొదటిరోజు ఓ సేవకుడు భోజనం తేగానే అతనితో



''మూడింటిలో ఒకటి...'' అన్నాడు. అతని ఉద్దేశం తనకున్న మూడురోజుల్లో ఇది మొదటిదని! కానీ, ఆ సేవకుడు దాన్ని వేరేగా అర్థం చేసుకున్నాడు.

మొత్తం ముగ్గురు సేవకులు కలిసి ఆ వెండి పళ్ళేలని దొంగిలించారు. వీళ్లలో అతను ఒకడు.ఈ విషయాన్ని విజయుడు గుర్తించాడని అతను భయపడ్డాడు.

పరుగెత్తుకుంటూ మిగతా ఇద్దరి దగ్గరకు వెళ్ళి ఈ విషయాన్ని చెప్పాడు. రెండవవాడు రెండువరోజు వెళ్ళాడు, అన్నం తీసుకుని విజయుడికి.

విజయుడు అతడిని చూస్తూనే ''రెండు...'' అన్నాడు. తన రోజుల్ని లెక్కపెట్టుకుంటూ.

తనను రెండోవాడుగా గుర్తించాడని భయపడి అతను వెనక్కి పారిపోయాడు.

మూడోరోజున మూడోవాడు వచ్చాడు. వాడిని చూస్తూనే ''మూడు... '' అన్నాడు విజయుడు దిగులుగా.

అంతే వాడు విజయుడి కాళ్ళ మీద పడిపోయాడు. తాము ముగ్గురే ఆ వెండి పళ్ళాలను దొంగిలించారని, వెంటనే వాటిని తిరిగి ఇచ్చేస్తామని. ప్రాణభిక్షను పెట్టమని వేడుకున్నాడు.

వెంటనే ఆ వస్తువులను తీసుకొచ్చి అక్కడ పెట్టేసి వెళ్ళి పొమ్మన్నాడు విజయుడు. అతను అలాగే చేశాడు.

మర్నాడు ఉదయం విజయుడిని ఉరి తీయించడానికి రాజు, భటులతో కలసి అక్కడికి వచ్చాడు. కాని అప్పటికే ఆ ప్రదేశంలో వెండి వస్తువులను చూసి ఆనంద పడిపోయాడు. విషయం తెలుసుకున్న రాజు విజయుడి గొప్పతనాన్ని పొగిడి, అతనికి తన ఆస్థానంలోనే ఉద్యోగం ఇచ్చాడు. దొంగతనం చేసిన భటుల్ని తీవ్రంగా శిక్షించాడు కూడా!



ప్రజలకి న్యాయం కలిగించాలనే ఉద్దేశంతో మహావీరుడు తన కోట బయట ఒక గంటని కట్టించాడు.

తమకి ఏదైనా అన్యాయం జరిగితే వాళ్ళు వచ్చి ఆ గంటని మోగించాలి. వెంటనే మహావీరుడు తన మంత్రితో వచ్చి విషయాన్ని విచారించి, వాళ్ళకి న్యాయం చేకూరుస్తాడు.

అలా ప్రజల్ని పరిపాలిస్తూ మంచి రాజుగా కీర్తి పొందాడు మహావీరుడు. చాలాకాలం నుంచి వాడుతుండడం వలన గంట చివర కట్టిన తాడు కొద్దిగా తెగిపోయింది. వెంటనే ప్రక్కన పాకిన ఓ తీగని తెంచి ఆ తాడుకి కట్టారు.

సరిగ్గా అదే సమయానికి ఒక గాడిద అటుగా వచ్చింది. దానితో అడ్డమైన చాకిరీ



చేయించుకుని మేత కూడా పెట్టకుండా ఊరు మీదకి తోలుతుంటాడు దాని యజమాని. అది అతనికి అలవాటు. అలా చేస్తే అది అక్కడ అక్కడ ఏదో తిని వచ్చేది. తనకి దాని తిండి ఖర్చు తప్పుతోందని అతని ఊహ. ఇన్నాళ్ళనుంచి అలాగే జరుగుతోంది.

ఆరోజు గాడిద అటు వైపుగా వచ్చి గంటకి కట్టిన తీగని చూసి మొక్కనుకొని నోటితో పట్టుకొని లాగింది.

అంతే! గంట మోగింది.

ఎవరో న్యాయం కోసం వచ్చారని రాజు మంత్రితో కలసి వచ్చాడు. ఎవరికి ఏ అన్యాయం జరిగిందో అని ప్రజలంతా బిలబిల వచ్చేసారు గంట దగ్గరకు.

అక్కడున్న గాడిదను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. పని చేయించుకుని యజమాని సరిగా తిండి పెట్టకపోవడంతో అది న్యాయం కోసం వచ్చిందని భావించారు అందరూ.

వెంటనే దాని యజమానిని పిలిపించాడు రాజు.

గాడిద యజమాని భయపడుతూ వచ్చాడు అక్కడకి. వెంటనే ''నీ సంపాదనలో సగాన్నిఈ గాడిదకు కేటాయించు. ఆ ధనంతో దీనికి రోజూ సరయిన తిండి పెట్టు'' అని ఆజ్ఞాపించాడు.



ఒక ఊళ్ళో సోమయ్య, సీతమ్మ అనే పేద దంపతులు నివసిస్తుండేవారు. వాళ్ళు తమకి ఉన్న దాంట్లో పేదలకీ కొంత పెట్టి, తాము తిని తృప్తిగా, అర్థవంతంగా జీవితాన్ని గడుపుతుండేవారు.

చుట్టుపక్కల ఉన్న ఆడవాళ్ళ వల్ల సీతమ్మలోనూ క్రమంగా మార్పు రాసాగింది. అది కావాలి, ఇది కావాలి అని సోమయ్యని వేధించడం మొదలుపెట్టింది.

సీతమ్మలో వస్తున్న మార్పుని సోమయ్య గమనిస్తూనే వున్నాడు. అయినా మారు మాట్లాడకుండా సమయం, సందర్భం కోసం వేచి చూడసాగాడు.

ఒకరోజు సీతమ్మ ''నువ్వెప్పుడూ దేవుణ్ణి ప్రార్థిస్తుంటావు. అంతేకాకుండా పేదలకి అన్నదానం చేస్తుంటావు కదా. మరి దేవుణ్ణి మనకి కూడా మిగతా వాళ్ళకి లాగా ధనంతో కరుణించమని వేడుకో'' అంది సోమయ్యతో.



''మనకి ఇప్పుడు ఏం తక్కువైంది. తిండికి గడవకుండా పోలేదు గదా'' అన్నాడు సోమయ్య.

''కేవలం తిండి గడిస్తే చాలదు కదా. అందరికిలా అన్ని వస్తువులూ అమర్చుకోవాలని నాకుమాత్రం ఉండదా ఏమిటి?'' అంది సీతమ్మ.

ఇంతలో దేవుడి ఫోటోలోంచి కొన్ని బంగారు నగలు కింద పడ్డాయి.

తమ సంభాషణ విని దేవుడు కరుణించాడని ఆ దంపతులు ఆనందించారు.

కానీ ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. ఆ నగలు దొంగల పాలవకుండా కాపాడడం పెద్ద సమస్య అయిపోయింది.

రాత్రిళ్ళు నిద్ర కూడా సరిగ్గా పట్టడం లేదు. ఎప్పుడు ఏ దొంగ వస్తాడో అనే భయంతో కాపలా కాయసాగారు. ఇంటికి ఎవరు వచ్చినా పూర్వంలా వాళ్ళని ఆదరించలేకపోతున్నారు. వాళ్ళు తమ నగల్ని ఎక్కడ కాజేస్తారోననే భయంతో అందర్నీ వెనక్కి పంపేయసాగారు.

ఎంతో కాలంనుంచి అతిథుల్ని ఆదరించి వాళ్ళు సంపాదించిన మంచి పేరు కాస్తా ఆ కొద్ది రోజుల్లోనే తుడిచిపెట్టుకుపోయింది. బిక్కుబిక్కుమంటూ గడపసాగారు. ఆ తర్వాత దేవుడూ మళ్ళీ కరుణించలేదు.

అప్పుడు వాళ్ళకి అర్థమైంది, అత్యాశకి పోయి ఎలాంటి ఇబ్బందుల్ని కోరితెచ్చుకున్నదీ!

'మీరిచ్చిన నగల్ని మీరే పట్టుకుపోండి' అని దేవుణ్ణి ప్రార్థించారు. దేవుడలాగే చేశాడు.

ఆరోజు నుంచీ మళ్ళీ మామూలు పద్ధతిలో తమకు ఉన్న దాంట్లో అతిథుల్ని సంతృప్తి పరుస్తూ తామింత తిని ఆనందంగా జీవించసాగారు ఆ దంపతులు.



ఒకప్పుడు శంకర్ అనే చిత్రకారుడు వుండేవాడు. అతడు గీసిన చిత్రాలలో జీవకళ ఉట్టిపడుతుండేది.

ఒకసారి అతను పుష్పం బొమ్మ గీస్తే - అది నిజమైన పువ్వేమోననుకుని మకరందాన్ని గ్రోలడానికి తుమ్మెదలు దాని మీద వాలాయి!

దాంతో ప్రజల మధ్య అతనో గొప్ప చిత్రకారుడుగా గుర్తింపు పొందాడు. నాకన్నా బొమ్మలని బాగా గీసేవాళ్ళు లేరనే భావం అతనిలోనూ నాటుకుపోయింది. గర్వం పెరిగిపోయింది.

రవి అనే మరో చిత్రకారుడు కూడా అదే గ్రామంలో ఉన్నాడు. ''శంకర్ కన్నా గొప్పగా నేను చిత్రాన్ని గియ్యగలను'' అని అతను చాలెంజ్‌చేసి ఓ చిత్రాన్ని గీసాడు.

అతనెంత గొప్పగా గీసాడో చూద్దామని శంకర్ కూడా ఆ చిత్రాన్ని చూడటానికి వచ్చాడు.



ఎంతసేపటికీ రవి ఆ చిత్రానికి అడ్డంగా వున్న తెరని తొలగించక పోవడంతో ''ఆ తెరని తియ్యండి. చిత్రాన్ని చూద్దాం'' అన్నాడు శంకర్.

''తెర వేసివున్న రంగస్థలాన్ని నేను గీశాను. మీరు దాన్ని నిజమైన తెరేమోననుకున్నారు. మీ చిత్రాలు క్రిమికీటకాల్నే బోల్తా కొట్టిస్తే నా చిత్రాలు మనుషుల్నీ మభ్యపెడుతున్నాయి'' చిన్నగా నవ్వుతూ అన్నాడు రవి.

శంకర్‌కి జ్ఞానోదయమైంది. గర్వాన్ని విడిచిపెట్టి చిత్తశుద్ధితో మరో చిత్రాన్ని గీసాడు.

మామిడిపళ్ళ బుట్ట పక్కన ఓ కుర్రాడు నుంచున్న చిత్రమది! బయటపెట్టాడు.

ఇంతలో ఓ కుక్క ఎక్కడి నుంచో దూసుకుంటూ వచ్చి ఆ బుట్టలో వున్నవి నిజమైన మామిడిపళ్ళేమోనని తెరని కొరికింది.

అందరూ ఆనందంతో తప్పట్లు కొట్టారు. అంత గొప్పగా చిత్రాన్ని గీసినందుకు శంకర్‌ని అభినందించారు.

కానీ శంకర్ మాత్రం దిగులుగా ''బొమ్మ బాగా రాలేదు'' అన్నాడు.

''అదేమిటి! కుక్క కూడా మీరు గీసిన మామిడిపండు నిజమైనదేనని భ్రమపడింది కదా!'' అక్కడికి చేరిన వాళ్ళలో ఒకడు ఆశ్చర్యంగా అన్నాడు.

''కావచ్చు. కానీ కుక్క బుట్ట పక్కనున్న మనిషిని నిజమైన మనిషిగా అనుకోలేదు. అనుకొని వుంటే అంత ధైర్యంగా బుట్ట దగ్గరకి వచ్చేది కాదుగా!'' తన చిత్రాన్ని విమర్శగా చూస్తూ అన్నాడు శంకర్.



అప్పట్లో ఎవరికీ చీకూ చింతా ఉండేది కాదు. అందరూ ఆనందంగా ఉంటూండేవారు. సమస్యలంటే వాళ్ళకి తెలీనే తెలీదు. అలాగే రోగాలు, వృద్ధాప్యం కూడా ఉండేవి కావు. అందరూ చిన్నపిల్లల్లా ఆనందంగా, హాయిగా ఆడకుంటూ, పాడుకుంటూ జీవితాన్ని గడిపేస్తూ ఉండేవారు.

రాము, రజని అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. ఒకరంటే మరొకరికి ఎంతో అభిమానం. ఇద్దరూ కలిసే ఆడుకొంటూ ఉండేవారు.

ఒకరోజు రాముకి ఒకదేవదూత ఎదురై ఒక చిన్నపెట్టెని ఇచ్చాడు. ఆ పెట్టెని తెరవవద్దని కూడా హెచ్చరించాడు. అందుకనే రామూ దాన్ని ఇంట్లో ఓ మూల పారేశాడు. కానీ రజనికి మాత్రం, ఆ పెట్టెని చూసినప్పుడల్లా అందులో ఏముందో అనే కుతూహలం పెరిగిపోతుండేది.

ఒకరోజున రామూ లేకుండా చూసి రజని ఆ పెట్టె దగ్గరికి చేరింది. మూత రాకుండా బిగించి



ఉన్న బంగారు తీగని తీయసాగింది. అది రావడం లేదు. కోపంతో ఆ పెట్టెని గట్టిగా నేలకేసి కొట్టింది.

వెంటనే పెట్టె దెబ్బతిన్నదేమోనని వంగి చెవిని దానికి ఆనించింది. లోపలనుంచీ తేనెటీగలు చేసే శబ్దాలు లాంటి శబ్దాలు వినిపించసాగాయి.

భయంతో పెట్టెని పక్కన పెట్టేయబోయింది. అందులోనుంచీ ''రజనీ! పెట్టెని తెరచి మాకు విముక్తి కలిగించు'' అని వినిపించింది. ఇంతలో రామూ కూడా అక్కడికి వచ్చాడు. రజనీ బంగారుతాడును గట్టిగా లాగింది. అది ఊడిపోయింది. చటుక్కున మూతని తెరిచింది.

అంతే! ఒక్కసారి వందల కొద్దీ నల్లటి రెక్కల పురుగులు బయటికి వచ్చేయి. ఒక పురుగు వచ్చి ఆమె మొహంమీద వాలింది.

మనుషుల చెడు ఆలోచనలకి కారణభూతాలు అవి. ఆ ఆలోచనలతో రకరకాల కష్టాలకు లోనవుతుంటారు. అన్ని పురుగులూ అక్కడ తిరుగుతుంటే భరించలేక రామూ, రజని ఆగది తలుపులన్నీ బార్లా తెరిచేసారు. వెంటనే ఆ పురుగులన్నీ బయటకి ఎగిరిపోయి, అందరి పిల్లల్ని బాధించసాగాయి.

అన్ని పురుగులూ ఎగిరి పోయాయో లేదోనని రజని పెట్టెలోకి తొంగిచూసింది. అందులో బంగారపు రంగులో వున్న ఓ పురుగు ఉంది.

''ఎవరు నువ్వు?'' అడిగింది రజని.

''ఇందాక బయటికి వచ్చిన పురుగులన్నీ చెడు ఆలోచనలని కలిగించి, కష్టాలను కొనితెచ్చేవి. నేను వాటినుంచీ ప్రజలకి కొద్దిపాటి విముక్తినయినా కలిగించే దానిని. 'ఆశ' అంటారు నన్ను...'' అంటూ ఒక్క సారిగా బయటకి దూకింది ఆ పురుగు.

ముందుచటుక్కున రజని మొహానికి తగిలింది. దాంతో ఆమె మొహం మీద అంతకు ముందు వాలిన చెడు పురుగు పారిపోయింది. దాని వెనుకే 'ఆశ' ఎగిరిపోయింది. అప్పటినుంచే లోకంలో కష్టాలు ప్రారంభమయ్యాయి. 'ఆశ' సాయంతో కొంతవరకైనా వాటిని ఎదుర్కోడానికి ప్రయత్నిస్తున్నారు ప్రజలు.



మాళవరాజు మహేంద్రవర్మ ఆస్థానంలో బుద్ధిమతి అనే మంత్రి వుండేవాడు. అతను చాలా తెలివిగలవాడు. ఏ విషయంలోనయినా నిజాన్ని ఇట్టే పసిగట్టేయగలవాడు. అందుకని తనదేశంలో ధర్మాన్ని నాలుగు పాదాలతో నడిపించడం పెద్ద కష్టంగా అనిపించడంలేదు మహేంద్రవర్మకు.

రాజుతో పాటు ప్రజలు కూడా బుద్ధిమతిని పొగడడం సహించలేనివారు, ఆ దేశంలో లేకపోలేదు. అటువంటి వాళ్ళలో కాళిందుడు ఒకడు. సభా సదులందరి ముందు ఏదో ఒక విషయంలో బుద్ధిమతిని హీనపరచాలని అతని ఉద్దేశం.

ఒకరోజు మహేంద్రవర్మ సభ తీరివుండగా కాళిందుడు రెండుపూలగుత్తులను తెచ్చాడు. రెండూ చూడడానికి ఒకలాగే ఉన్నాయి. వాటిలో ఒకటి నిజమైన పూలగుత్తి, రెండవది వస్త్రపు గుడ్డలతో చేసిన పూలగుత్తి. ''వీటిలో నిజమైనది ఏదో చెప్పండి'' అంటూ బుద్ధిమతిని అడిగాడు

©$®



కాళిందుడు.

చూడడానికి రెండూ ఒకేలాగ ఉన్నాయి. వాటిలో నిజమైనదేదో ఎలా కనుక్కోవడం... బుద్ధిమతి ఆలోచిస్తుండగా ఓ తేనెటీగ అటుగా వచ్చి రెండు గుత్తుల చుట్టూ తిరిగి ఆఖరికి ఓ దానిమీద వాలింది.

''ఇదీ నిజమైన పూలగుత్తి'' చటుక్కున దాన్ని పట్టుకొని అన్నాడు బుద్ధిమతి.

రాజు, కాళిందుడుతో పాటు అందరూ అతని తెలివితేటలకి సంతోషించారు.



రామాపురం అనే గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములుండేవారు. పెద్దవాడి పేరు మాధవయ్య. చిన్నవాడి పేరు రాధయ్య. మాధవయ్యకి తమ్ముడి కన్నా ఆస్తి ఎక్కువగా ఉంది. కానీ, ప్రతీ పైసా చాలా జాగ్రత్తగా ఖర్చుపెట్టేవాడు. భార్య కూడా అతడికి సహకరించేది.

తమ్ముడికి ఆస్తి ఎక్కువ లేదు.. రోజూ తడికలు అల్లుకుని వచ్చే సంపాదన ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టేవాడు. అంతేకాక ఎప్పుడూ ఇంటికి ఎవరో ఒకరు వస్తూండేవారు. వారికోసం చేపలు, మాంసం, ఇంకా ఖరీదైన వస్తువులు తెచ్చి పిండివంటలు వండించేవాడు. భార్య అనవసరపు ఖర్చులు తగ్గించమని చెప్పినా వినేవాడుకాదు. రూపాయి అయినా దాచేవాడు కాదు.

రోజూ వీళ్ళింటినుంచి వచ్చే వంటకాల వాసనలు, వచ్చేపోయే వారిని చూస్తూ మాధవయ్య



భార్య సీతమ్మ భర్తని ఇలా అడిగింది.

''నీ తమ్ముడికి నీ అంత ఆస్తి లేదుకదా? అంత డబ్బు ఎలా ఖర్చు పెడుతున్నాడు'' అని అడిగింది. దానికి మాధవయ్య ''వాడికి డబ్బు విలువ తెలియదు. వాడిని దారిలో పెడతాను చూస్తుండు'' అన్నాడు.

కొన్ని రోజులు గడిచిపోయిన తర్వాత రాధయ్య ఇంటికి మిత్రుల రాక తగ్గింది. వాళ్ళింటినుంచి ఎటువంటి వంటకాల వాసనలు రావట్లేదు సీతమ్మకి. దానికి కారణం ఏమిటో అర్థం కాలేదు.

రోజూ సీతమ్మ, రాధయ్య భార్య కమలమ్మ వారిళ్ళ మధ్య ఉండే గోడ దగ్గర నుంచుని మాట్లాడుకునేవారు. కమలమ్మ రెండు రోజులనుంచి రావట్లేదు. సీతమ్మ కారణం తెలుసుకోవాలని కమలమ్మ ఇంటికి వెళ్ళింది.

కాని కమలమ్మ తల ఎత్తకుండా తడికలు అల్లుతోంది. కొంతసేపటికి సీతమ్మని చూసి కూచోబెట్టి చాలా విషయాలు మాట్లాడింది. చివరికి సీతమ్మ ''కమలమ్మా! నిన్నొక విషయం అడుగుతాను. నాకు సమాధానం చెప్తావా?'' అనడిగింది కమలమ్మ.

''ఏ విషయం'' అనడిగింది.

అప్పుడు సీతమ్మ ''రోజూ నువ్వు, నీ భర్త నిద్రాహారాలు లేకుండా తడికలు అల్లుతున్నారు. మీ యింటికి మిత్రుల రాకపోకలు కూడా తగ్గాయి. కారణం ఏమిటి?'' అని అడిగింది.

కమలమ్మ ముందు కారణం ఏమీ లేదని చెప్పింది. కాని సీతమ్మ బలవంతంవల్ల తప్పించుకోలేకపోయింది.

''నువ్వు ఎవరికీ ఈ రహస్యం చెప్పనంటే చెప్తాను. నా భర్త ఒకరోజు ఉదయం లేవగానే ఇంటికి బయటకి వెడితే ఒక సంచి దొరికింది. అందులో తొంభై తొమ్మిది బంగారు నాణేలున్నాయి. అవి చూసి వంద నాణాలు పూర్తి చేయాలని ఒక రోజు కష్టపడి తడికలు అల్లడం మొదలుపెట్టాం. ఎవరితో సంబంధం లేనట్లుగా ఉండి ఖర్చులు తగ్గించి వంద పూర్తి చేశాం. వాటిని రెండు వందలు

చేయాలనే కోరికతో ఇప్పుడు ఇలా కష్టపడి పని చేస్తున్నాం'' అని చెప్పింది.

సీతమ్మ ఈ సంగతి భర్తకి చెప్పింది. రాధయ్య ఖర్చులు తగ్గించి దారిలోకి రావడానికి తానే అలా బంగారు నాణేలు రాధయ్య ఇంటిముందు ఉంచానని నవ్వుతూ చెప్పాడు మాధవయ్య.





రాణీకి దీపావళి పండుగ అంటే చాలా ఇష్టం. స్కూలు నుంచి ఇంటికి రాగానే వాళ్ళ నాన్న దగ్గరకి పరుగెత్తికెళ్ళి ''నాన్నా! దీపావళి ఇంక నాలుగు రోజులే ఉందిట కదా? మా స్కూలులో పిల్లలందరూ అప్పుడే కొత్తబట్టలు, టపాసులు కొనేశారుట. నాకివ్వాళ కొనిపెట్టవూ'' అని గారాబంగా అడిగింది.

''సరే'' అని రాణీని తీసుకుని వాళ్ళ నాన్న కొత్తగౌను, టపాసులు కొనడానికి వెళ్ళాడు. బజారునంతా రాణి వింతగా, ఆనందంగా చూస్తోంది. వాళ్ళ నాన్న రాణిని గౌన్లు అమ్మే షాపుకి తీసికెళ్ళాడు. అక్కడి రంగు రంగుల గౌన్లు రాణికి చాలా నచ్చాయి. అయితే వాటిలో ఎర్రటి గౌను ఇంకా నచ్చింది. వాళ్ళ నాన్న చేత అదే కొనిపించుకొంది.

ఎర్రగౌను కొన్న దగ్గర నుంచి రాణి రోజూ అదేగౌను వేసుకొనేది. స్కూలునుంచి రాగానే

©$®

బట్టలు మార్చుకోమంటే, ఆ గౌను తొడుక్కునేది. అది మాసిపోతే దాన్ని తనే ఉతికి ఆరేసుకుని వేసుకుంటూ ఉండేది. ఏ కాలంలో అయినా ఆ గౌను తన ఒంటిమీంచి విప్పడానికి ఇష్టపడేది కాదు.శీతాకాలంలో ఆ గౌను మీదే స్వెట్టర్ వేసుకొనేది. వేసవికాలం ఉక్కగా ఉన్నా ఆ గౌనే ఉంచుకునేది.

కొన్ని రోజులకి రాణి ఎర్రగౌను చిరిగిపోయింది. వాళ్ళమ్మ బట్టలు మార్చుకోమంటే ఏడుస్తూ కూచుంది. అప్పుడు వాళ్ళమ్మ బుజ్జగించి ''రాణీ అన్నింటికీ అలా ఏడవకూడదు. నీది ఏదైనా పుస్తకం చిరిగిపోయింది అనుకో. కొత్త పుస్తకం కొనుక్కుంటావు కదా! అలాగే ఇది కూడా. నువ్వు ఏడుస్తావనే నాన్నగారు నీ కోసం కొత్త ఎర్ర గౌను కొనుక్కొని వచ్చారు. ఇదేసుకో'' అని చెప్పింది. ఆ గౌను చూడగానే రాణికి ఏడుపంతా పోయింది. అది వేసుకుని చాలా సంతోషంగా ఆడుకోవడానికి వెళ్ళింది.





విజయుడికి వాళ్ళమ్మ రంగు రంగుల కుచ్చుటోపీని అల్లి ఇచ్చింది. అది చూడడానికి ఎంతో బాగుంది. దాన్ని తలమీద పెట్టుకున్న ఎటువంటి మొహానికైనా కొత్త అందం వస్తుంది. అందులో సందేహం లేదు.

ఆరోజు అమ్మ ఇచ్చిన కొత్త టోపీని తలమీద పెట్టుకుని బయటికి వచ్చాడు విజయుడు. దారిలో అందరూ అతని టోపీని మెచ్చుకోసాగారు. కొంతమంది అయితే తమదగ్గర ఉన్న వస్తువులని విజయుడికిచ్చి అతని టోపీని తీసుకోవాలని ప్రయత్నించారు. కానీ విజయుడు ఒప్పుకోలేదు.

ఆఖరికి ఓ ముసలమ్మ ''ఇంత అందమైనటోపీని పెట్టుకున్న నువ్వు రాజు దగ్గరకు వెళ్ళవచ్చు''

©$®

అంతే! విజయుడు వెంటనే రాజమందిరం వేపు బయలుదేరాడు. దారిలో కనిపించిన అందరూ అతని టోపీని అడగసాగారు.

రాజభటులు కూడా అతని టోపీని పొగుడుతూ, విజయుని లోపలికి వెళ్ళనిచ్చారు. ఆటోపీ ధరించిన విజయుడు యువరాజులా కనిపిస్తున్నాడు.

రాజకుమార్తె విజయుడి టోపీని చూసి ముగ్ధురాలు అయ్యింది. ''దాన్ని నాకివ్వవా?'' అని ముద్దుముద్దుగా అతడిని అడిగింది.

''ఇవ్వనంటే ఇవ్వను'' అన్నాడు విజయుడు.

ఇంతలో రాజు అక్కడికి వచ్చాడు. విజయుడి టోపీని చూసి ముగ్ధుడై ''నా బంగారు కిరీటాన్ని ఇస్తాను. నీ రంగుల టోపీని ఇవ్వవా?'' అని అడిగాడు.

ఇవ్వనంటే రాజుకి కోపం వస్తుందేమోనని, అక్కణ్ణించీ ఇంటివేపు పరిగెత్తసాగాడు విజయుడు. దారిలో ఎవరు ఆపినా కూడా ఆగలేదు.

ఇంటికి వచ్చి జరిగిందంతా చెప్పాడు.

''పిచ్చివాడా! రాజు బంగారు కిరీటాన్ని ఇస్తే తీసుకోవచ్చు గదా?'' అన్నాడు అన్న.

''మా అమ్మ ఇచ్చిన దాని కన్నా నాకు ఏదీ విలువైనది కాదు'' అంటూ అమ్మ ఒడిలో తలదాచుకున్నాడు విజయుడు. విజయుడి మాటలకి అమ్మ ఆనందపడిపోయింది.





ఆరోజు బాబిగాడి పుట్టినరోజు రకరకాల బొమ్మలు బహుమతులుగా వచ్చాయి. వాటన్నింటినీ కిటికీ పక్కనే ఉన్న టేబుల్ మీద పెట్టాడు.

అందులో విమానం, ఓడ, రైలు, బస్సు, హంస, ఏనుగు, సింహం మొదలైన బొమ్మలతో పాటు కాగితంతో చెయ్యబడ్డ అందమైన ఓ నాట్యగత్తె బొమ్మ ఉన్నాయి.

అంతకు ముందు తన దగ్గర వున్న ఓ కాలు విరిగిన సిపాయి బొమ్మని తీసుకొచ్చి ఆ బొమ్మల పక్కనే టేబుల్ మీద పెట్టాడు బాబిగాడు.

టేబుల్ మీదకి రాగానే సిపాయి కన్ను అక్కడ వున్న నాట్యగత్తె బొమ్మ మీద పడింది. 'అది చాలా బావుంది కదూ' అనుకున్నాడు సిపాయి.

©$®

# 18. గర్వ భంగం



కానీ నాట్యగత్తె మాత్రం కుంటికాలు సిపాయిని అసహ్యించుకోవడం మొదలుపెట్టింది. పక్కపక్కనే ఉండడంతో ఒకరి భావాలు మరొకరికి తెలియడానికి ఎంతోసేపు పట్టలేదు.

బాబిగాడు ఆ రాత్రి పడుకునేటప్పుడు కూడా బొమ్మల్ని అక్కడినుంచి తీసేయలేదు. కిటికీ తలుపులు వెయ్యడం కూడా మరచిపోయాడు.

రాత్రంతా నాట్యగత్తెని చూస్తూ గడపవచ్చని సిపాయి సంతోషించాడు. కానీ ఆ సిపాయి సంతోషం ఎంతోసేపు నిలవలేదు. తనని అసహ్యంగా చూస్తున్న నాట్యగత్తె చూపుల్ని చూడలేక ఇటుపక్కకి తిరిగాడు కుంటిసిపాయి.

ఇంతలో బయట చినుకులతో వాన ప్రారంభమైంది. క్రమక్రమంగా వాన పెరిగి పెద్దదయింది. కిటికీ తలుపులు వెయ్యకపోవడంతో వాన జల్లు టేబుల్ మీద పడసాగింది.

సిపాయి బొమ్మ రేకుతో చెయ్యబడింది కాబట్టి వాన చినుకులు మీద పడ్డా ఆ బొమ్మకి పెద్దగా నష్టం జరగదు. కానీ నాట్యగత్తెబొమ్మ రంగురంగుల కాగితాలతో చెయ్యబడింది. అందుకని చినుకులు మీద పడడంతో కాగితాలు నానిపోయి నాట్యగత్తె బొమ్మ పాడవసాగింది.

వెంటనే నాట్యగత్తె బొమ్మ తనని రక్షించమని సిపాయి బొమ్మని వేడుకుంది. ఇంతకు ముందు నాట్యగత్తె బొమ్మ మీద ఎంత కోపం వచ్చినా, అది అలా దయనీయంగా అడిగేసరికి జాలేసింది సిపాయి బొమ్మకి.

వెంటనే ఇవతలకి గెంతి నాట్యగత్తె బొమ్మమీద జల్లు పడకుండా అడ్డు నిల్చింది సిపాయి బొమ్మ. కుంటిదయినా సిపాయి బొమ్మ ఎంత గట్టిదో, అది గర్వం చూపిస్తే తనకి ఈ పాటికి ఎటువంటి గతి పట్టేదో అర్థం చేసుకుంది నాట్యగత్తె బొమ్మ. మళ్ళీ ఎప్పుడూ గర్వపడకూడదని కూడా అప్పుడే నిశ్చయించుకుంది.

చూశారా బాలలూ! గర్వం ఎప్పుడూ మంచిది కాదు, ఎవరికైనా సరే మనం సాయపడగలిగే స్థితిలో ఉంటే తప్పకుండా సాయం చెయ్యాలి.

# 19. దేవుడి లీల





ఇద్దరు మనుషులు అడవిగుండా ప్రయాణం చేస్తున్నారు. వాళ్ళలో రాము అనే అతను అతిమంచివాడు. స్వార్థంకోసం పరులకు పొరబాటున కూడా హాని తలపెట్టడు. కష్టపడకుండా హాయిగా రోజులు గడవాలని ఆలోచించే మనస్తత్వం కలవాడు.

ఆరోజు వాళ్ళిద్దరూ పట్నం బయల్దేరారు. దారిలో సోము తన సొమ్ము ఎక్కడ కాజేస్తాడో అని రాము తగు జాగ్రత్తలు తీసుకునే అతనితో ప్రయాణం చేస్తున్నాడు. మరికొన్ని గంటలపాటు ఆ అడవి గుండా ప్రయాణం చేస్తేగాని వాళ్ళు పట్నాన్ని చేరుకోరు.

ఇద్దరు ప్రక్కప్రక్కనే నడుస్తున్నా తన మూటని కిందపెట్టకుండా చంకలో గట్టిగా పట్టుకునే నడుస్తున్నాడు రాము. దాహం తీర్చుకునేప్పుడు, భోజనంచేసేప్పుడు మూట సోముకి అందకుండా

జాగ్రత్తపడ్డాడు రాము.

వాళ్ళిద్దరూ ప్రక్కప్రక్కనే నడుస్తున్నారు.

రాము తను ఏ మాత్రం ఏమరుపాటుగా వున్నా సోము మూట ఎక్కడ ఎత్తుకుపోతాడో అని అతిజాగ్రత్తగా ఉంటున్నాడు.

రాము ఏ మాత్రం ఏమరుపాటుగా వున్నా మూట నెత్తుకుపోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు సోము.ఇద్దరూ ప్రక్కప్రక్కనే నడుస్తున్నారు. హఠాత్తుగా రాము కాలిలో ముల్లు గుచ్చుకుంది. ''అబ్బా'' అంటూ కాలు పుచ్చుకుని కూలబడిపోయాడతను.

అదే అవకాశంగా భావించి రాముచంకలో నుండి జారిన మూటని పుచ్చుకుని ముందుకురికాడు సోము. అంత బాధలోనూ నవ్వొచ్చింది రాముకి. విరక్తిగా నవ్వుకున్నాడు.

'దేవుడు గొప్పవాడనుకున్నాడు తనింతవరకూ. కానీ ఆయన గొప్పవాడు కాదు. గొప్పవాడే అయితే పరుల సొమ్ముకి ఆశించని తనని ముల్లుతోబాధించి, దొంగకి తనకష్టార్జితం చేరేటట్లుచెయ్యడు' అనుకున్నాడు.

ఇంతలో పెద్దగా పులి గాండ్రింపు వినిపించింది. కాల్లీడ్చుకుంటూనే చటుక్కున పక్కనున్న పొదపక్కకి జరిగాడు. దూరంగా పులి గాండ్రింపుతో పాటు పెద్ద గావుకేక వినిపించింది.

అది ఎవరిదో గుర్తుపట్టాడు రాము.

చటుక్కున కాలిలోని ముల్లు లాగేసి బాధని ఓర్చుకుంటూనే అరుపు వినవచ్చిన వేపు బయల్దేరాడు.

రాము అక్కడికి చేరుకునే లోపే పులి సోమును చంపేసి, అతని రక్తం తాగి, అక్కడి నుంచీ వెళ్ళిపోయింది.

సోము శవం ప్రక్కన రాము మూట కనిపించింది. దాని పక్కనే సోము సొమ్ము మూట కూడా కనిపించింది.

చటుక్కున తను ఇందాక అనుకున్న మాటలు గుర్తుకొచ్చాయి రాముకి 'దేవుడు చాలా



గొప్పవాడు! ఆయన కళ్ళు మూసి ప్రవర్తించడం ఎవరితరం కాదు. కాలిలో ముల్లు గుచ్చుకోకపోతే తనే పులి వాత పడేవాడేమో!' మనసులోనే వేయిసార్లు దేవుణ్ణి ప్రార్థించి దణ్ణం పెట్టుకుని తన మూటతోపాటు సోము మూటనీ తీసుకుని ముందుకు కదిలాడు రాము.

©$®



కుక్కలు చాలా విశ్వాసం గల జంతువులు. అందుకనే చాలా వందల సంవత్సరాల క్రితం నుంచీ మనిషి వాటిని చేరదీసి పెంచుతున్నాడు.

ఇంటిని కాపలా కాయడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. గుడ్డివాళ్లకి దారి చూపించడానికి ఉపయోగపడుతున్నాయి. వాసనతో దొంగల్ని కూడా పట్టుకుంటున్నాయి.

చూడడానికి తోడేళ్ళకి, నక్కలకి, కుక్కలకి పోలికలు కనిపిస్తున్నా చాలా తేడాలు ఉన్నాయి. కుక్కలు మొరుగుతాయి. తోడేళ్ళు మొరగవు. నక్కలు ఊళవేస్తాయి. తోడేళ్ళు గుంపులుగా తిరుగుతుంటాయి. దాదాపు వంద రకాల కుక్కలున్నాయి. నక్కలు జనం మధ్యకి రావు. కుక్కలు మనుషులతో కలిసి జీవిస్తాయి.

తోడేళ్ళు చిన్న చిన్న జంతువులని చంపి తింటుంటాయి. వీలైతే చిన్నపిల్లల మీద కూడా విరుచుకుపడుతుంటాయి. నక్కలు నక్కి నక్కి జంతువుల్ని, మనుషుల్ని కూడా మోసం

©$®



చేస్తుంటాయి. కానీ కుక్కలలా కాదు, మనుషుల్ని ప్రేమిస్తాయి. అందుకే మనిషి తోడేళ్ళని దూరంగా ఉంచాడు. కుక్కలని చేరదీశాడు.

సాధారణంగా తోడేళ్ళు ఒకే ప్రాంతంలో తిరుగుతుంటాయి. ఆ ప్రాంతంలోకి కొత్త జంతువులేమైనా వస్తే అవి ఊరుకోవు. కుక్కలు కూడా అంతే తాము ఉంటున్న ప్రదేశంలోకి కొత్త కుక్కలు వచ్చినా విరుచుకుపడతాయి. కానీ, తమని పెంచుతున్న మనుషుల్ని బాగా ప్రేమిస్తాయి. అందుకే అవి మనుషుల మధ్య పెరుగుతుంటాయి. నక్క, తోడేలు మనుషులకు దూరంగా అడవులలో తిరుగుతుంటాయి.



''అమ్మా! ఆకలేస్తోందే!'' దిబ్బరొట్టెలు వేస్తున్న తల్లి చుట్టూ చేరారు ఏడుగురు పిల్లలు.

లావుగా చూడడానికి కూడా బాగా కనిపిస్తున్న, పెనంమీద ఉన్న రొట్టెని చూస్తున్న కొద్దీ వాళ్ళ నోళ్ళు ఊరసాగాయి. ఆ రొట్టె నాకు కావాలంటే నాకు కావాలని తల్లిని వేధించసాగారు.

''ఉండండరా! ముందు రొట్టెని కాలనీండి...'' వాళ్ళందర్నీ సమాధానపరచసాగింది తల్లి.

ఈ మాటలన్నీ వింటున్న పెనంమీద కాలుతున్న రొట్టెకి భయం వేసింది-వీళ్లందరూ తనని తినడానికి కాసుక్కూర్చున్నారన్నమాట! భయంతో వణికిపోయింది.

పెనంమీదనించీ దూకి పారిపోవాలని పైకి ఎగిరింది. మళ్లీ వెంటనే అదే పెనంమీద పడింది,



రెండో వేపుకి తిరిగి!

పిల్లలందరూ దాన్ని కొరుక్కు తినేయాలనే ఆశతో చూడసాగారు. రెండు పక్కలా కాలడంతో రొట్టె గట్టిపడింది. అంతే! చటుక్కున పెనంమీదనుంచీ కిందకి దూకి దొర్లుకుంటూ దూరంగా పారిపోసాగింది.

''రొట్టెని పట్టుకోండి...'' అంటూ ఏడుగురు పిల్లలూ దాని వెనుక పడసాగారు. వేగం హెచ్చించింది రొట్టె.

దార్లో ఓ మనిషి కలిశాడు.

''రొట్టే! అంత తొందరగా పరుగెత్తకు. కొద్దిగా ఆగు. నన్ను ఒక్క ముక్క కొరుక్కోనీ....'' అతని మాటలు వినగానే దాని కంగారు ఇంకా ఎక్కువైంది. వేగం పెంచింది.

''నన్ను తినాలనుకుంటున్న ఏడుగురు పిల్లలకీ దూరంగా పోవాలనే పరుగెత్తుతున్నాను. నిన్నెలా తిననిస్తాను...'' అంటూ పరుగెత్తుతున్న దాన్ని పిల్లలతోపాటు ఆ మనిషీ అనుసరించసాగాడు.

ఓ కోడి ఎదురైంది రొట్టెకి.

''ఎందుకండీ రొట్టెగారూ అలా పరుగెడుతున్నారు. నన్ను చిన్న ముక్క కొరుక్కోనివ్వండి'' అంటూ అదికూడా వెంటబడసాగింది.

దారిలో ఓ బాతు, కుక్క కూడా తమని ఓ ముక్క కొరుక్కోనివ్వమని రొట్టె వెంటపడసాగాయి.

ఇలా ముందు రొట్టె-వెనుక ఏడుగురు పిల్లలు, మరోమనిషి, కోడి, బాతు, కుక్క పరుగెత్తసాగాయి.

ఇంతలో రొట్టెకి ఓ పంది ఎదురొచ్చింది. ''అంతగా భయపడి పరుగెత్తకు. నాతో రా నిన్ను రక్షిస్తాను'' అంది.

రొట్టె, పంది పక్కపక్కనే పరుగెత్తసాగారు.

ఇంతలో చిన్న నీటి గుంట ఎదురొచ్చింది. ''నా మూతిమీద కూర్చో నిన్ను దాటవేస్తాను'' అంది పంది.వెంటనే రొట్టె దానిమూతి మీదకి ఎక్కింది.

అంతే! పంది దాన్ని చటుక్కున పైకెగరేసి నోటితో పట్టుకుని నమిలేసింది. పాపం! పిచ్చి రొట్టె ఇంకెక్కడికి పరుగెత్తగలదు!!





హాలెండ్‌లో పీటర్ అనే కుర్రాడు అమ్మానాన్నల దగ్గర అల్లారు ముద్దుగా పెరుగుతున్నాడు.

సముద్రం బారి నుంచి హాలెండ్‌ని రక్షించడానికి పెద్ద గోడవుండేది. ఎంత పెద్ద అలలు వచ్చినా ఆ గోడకి కొట్టుకుని వెనక్కి వెళ్ళిపోతుండేవి. హాలెండ్ ప్రజలని సముద్రం తాకిడి నుంచి రక్షించేదన్నమాట ఆ గోడ.

ఒక రోజున పీటర్ గోడ దగ్గర్లో ఆడుకుంటుంటే నీటి శబ్దం వినిపించింది.

అటు వెళ్ళి చూసే సరికి గోడకి చిన్న కన్నంపడి నీళ్ళు లోపలికి వస్తున్నాయి. ఆకన్నాన్ని అలాగే వదిలేస్తే అది అది పెద్దదై పోయి చివరికి సముద్రపు నీరంతా ఊరుమీద పడి ప్రజల ప్రాణాల్ని తీసేస్తుంది.

అందుకే మరు ఆలోచన లేకుండా పీటర్ చటుక్కున తన వేలుని ఆ కన్నంకి అడ్డుపెట్టాడు.

అలా ఎంత సేపు అక్కడున్నా ఎవ్వరూ అటు వేపు రాలేదు.

చీకటి పడసాగింది.

పీటర్‌లో భయం పెరగసాగింది. అయినా వేలుని కన్నంలోంచి తీసివేయకుండా అలానే ఉంచాడు.

తెల్లవార్లూ అతను అలాగే గడపవలసి వచ్చింది.

తెలతెలవారుతుండగా అటుగా వచ్చిన మనిషి పీటర్ని చూసి ఆశ్చర్యపోయాడు.

క్షణాల్లో ఆ వార్త ఊళ్ళోకి వ్యాపించింది. వెంటనే ఆ కన్నాన్ని పూడ్చివేశారు. అంతవరకూ అలానే ఉండడంతో పీటర్ స్పృహతప్పి పడిపోయాడు. ధైర్యవంతుడయిన ఆ బాలుణ్ణి అందరూ పొగుడుతూ తల్లిదండ్రుల దగ్గరికి చేర్చారు. సముద్రం బారినుంచి ప్రజలందరి ప్రాణాలనీ రక్షించిన అతని ధైర్య సాహసాలని మాత్రం అక్కడి వాళ్ళెప్పుడూ మరచిపోలేదు. అదే అతనికి ఆభరణమైంది. అతడిని కన్న తల్లిదండ్రులకి గర్వకారణమైంది.





రామాపురంలో గుణవర్ధనుడు అనే ధనికుడు ఉండేవాడు. అవసరంలో ఉన్న పేదలని అతను ఆదుకుంటూ ఉండేవాడు.

కష్టించి శ్రమించే వాళ్ళకి ఆర్థిక ఇబ్బందులు వస్తే తీర్చవచ్చుగాని, కష్టించని సోమరిపోతులకు సహాయం చెయ్యడం అతనికి ఇష్టంలేదు.

ఒకరోజున గుణవర్ధనునికి ఓ ఆలోచన వచ్చింది. ఓ పెద్ద బండ రాతిని రోడ్డుకి అడ్డంగా దొర్లించి కొద్దిగా అవతల ఉండి గమనించసాగాడు.

అటుగా పోయే ప్రతీఒక్కరూ ఆ బండని తప్పించుకుని పక్కనుంచీ పోయేవాళ్ళేగాని, దాన్ని పక్కకి నెట్టాలని ప్రయత్నించిన వాళ్ళెవ్వరూ లేరు. కొంతమంది 'ఎవడీ రాయిని రోడ్డు మీద పడేసింది' అని తిట్టుకున్నారు కాని, దాన్ని పక్కకి నెట్టలేదు.

ఒక్కరూ ఆ రాతిని పక్కకి నెట్టాలని ప్రయత్నించినవారు లేరు. గుణవర్ధనుడు అలానే గమనించసాగాడు.

ఓ రైతు యువకుడు అటుగా వస్తూ కనిపించాడు.


రోడ్డుకి మధ్యన ఉన్న ఆ రాతిని చూడగానే అతనికి చిరాకేసింది. బలవంతాన ఆ రాతిని పక్కకు నెట్టాడు.

ఆశ్చర్యం! ఆ రాతికింద బంగారు నాణేలు కనిపించాయి.

చుట్టూ చూసేడు. ఎవ్వరూ కనిపించలేదు. ఆ బంగారు నాణేలని తీసుకుని యువకుడు ఇంటి దారి పట్టాడు.

అంత వరకూ పక్కనే పొంచి ఉండి గమనిస్తున్న గుణవర్ధనుడు కూడా ఆనందంతో అక్కణ్ణించీ వెళ్ళిపోయాడు.





"మనిషంటే నాకు భయం. మనుషులు మమ్మల్ని తమ బానిసలుగా మలచుకుంటుంటారు. మేము వాళ్ళకి బానిసలం. అందుకని మీరు మనిషి దగ్గరకి వెళ్తే బాగుంటుంది" అంది కుక్క బొద్దింకలతో.

బొద్దింకలన్నీ కలసి ఓ పాకలో నివసిస్తున్న మనిషి దగ్గరికి వెళ్ళాయి. విషయమంతా వివరంగా చెప్పాయి.

అతను గట్టిగా నవ్వాడు.

"నేనెవరికి భయపడతానో తెలుసా? బొద్దింకలకు! నా ఇంట్లో తాగే, తినే వస్తువులే ఏమిటి? ఏమి తెచ్చినా ముందు బొద్దింకలు రుచిచూసేస్తున్నాయి. వాటి బాధతో నేనెంతో క్రుంగిపోతున్నాను.

©$®

అందుకని మనుషులే్న బాధించే మీరు జంతువులకన్నా తక్కువ వాళ్ళు ఎందుకవుతారు'' అన్నాడు.

బొద్దింకలన్నీ ఆనందంగా వెనుదిరిగాయి.

తమ ప్రదేశాన్ని చేరుకోగానే పెద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశాయి.

''మనుషులు కూడా మనమంటే భయపడిపోతున్నారు. మనం ఏదో తక్కువవాళ్ళుగా భయపడడం సరయిన పద్ధతి కాదు. ఈ రోజు నుండి గర్వంగా బ్రతుకుదాం'' అంటూ బొద్దింకల పెద్ద అనర్గళంగా మాట్లాడింది.

బొద్దింకలన్నీ ఆనందంతో చప్పట్లు చరిచాయి.

ఇంతలో ఓ మనిషి వాటిమీద ఏదో మందు జిల్లాడు. ఆ మందు వాసనకి అక్కడున్న బొద్దింకలన్నీ ఒక్కసారిగా చచ్చాయి.





''మనిషంటే నాకు భయం. మనుషులు మమ్మల్ని తమ బానిసలుగా మలచుకుంటుంటారు. మేము వాళ్ళకి బానిసలం. అందుకని మీరు మనిషి దగ్గరకి వెళ్తే బాగుంటుంది'' అంది కుక్క బొద్దింకలతో.

బొద్దింకలన్నీ కలసి ఓ పాకలో నివసిస్తున్న మనిషి దగ్గరికి వెళ్ళాయి. విషయమంతా వివరంగా చెప్పాయి.

అతను గట్టిగా నవ్వాడు.

©$®

"నేనెవరికి భయపడతానో తెలుసా? బొద్దింకలకు! నా ఇంట్లో తాగే, తినే వస్తువులే ఏమిటి? ఏమి తెచ్చినా ముందు బొద్దింకలు రుచిచూసేస్తున్నాయి. వాటి బాధతో నేనెంతో క్రుంగిపోతున్నాను. అందుకని మనుషుల్నే బాధించే మీరు జంతువులకన్నా తక్కువ వాళ్ళు ఎందుకవుతారు" అన్నాడు.

బొద్దింకలన్నీ ఆనందంగా వెనుదిరిగాయి.

తమ ప్రదేశాన్ని చేరుకోగానే పెద్ద సమావేశాన్ని ఏర్పాటు చేశాయి.

"మనుషులు కూడా మనమంటే భయపడిపోతున్నారు. మనం ఏదో తక్కువవాళ్ళుగా భయపడడం సరయిన పద్ధతి కాదు. ఈ రోజు నుండి గర్వంగా బ్రతుకుదాం" అంటూ బొద్దింకల పెద్ద అనర్గళంగా మాట్లాడింది.

బొద్దింకలన్నీ ఆనందంతో చప్పట్లు చరిచాయి.

ఇంతలో ఓ మనిషి వాటిమీద ఏదో మందు జల్లాడు. ఆ మందు వాసనకి అక్కడున్న బొద్దింకలన్నీ ఒక్కసారిగా చచ్చాయి.





ఒకరోజు ఒక గొప్ప పండితుడు వీధిలో వెళ్తున్నాడు. ఆయన చేతిలో ఒక పెద్ద పుస్తకం ఉంది. ఆయన దేవాలయంలో పురాణం చెప్పటానికి త్వరగా వెళ్తున్నాడు. దారిలో ఒక అధికారి ఎదురుపడి "అయ్యా! ఈరోజు వర్జ్యం ఎప్పుడు?" అని అడిగాడు.

అందుకు జవాబుగా పండితుడు "అయ్యా! నేను ఈ రోజు పంచాంగం చూడలేదు. వర్జ్యం ఎప్పుడో తెలియదు" అన్నాడు.

"ఆ చేతిలోని పుస్తకం చూసి చెప్పకూడదా?" అన్నాడు అధికారి.

"అయ్యా! ఇది భారతం. ఇందులో వర్జ్యం సంగతి ఉండదు"

"వర్జ్యం చెప్పని అంత పెద్ద పుస్తకాన్ని ఎందుకు మోసుకెళ్తున్నావు మోత బరువు" అన్నాడు

©$®

అధికారి. తొందరలో ఉండడంవలన పండితుడు అప్పుడు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

కొన్ని రోజుల తర్వాత పెద్ద కత్తిని చేతపట్టుకుని అధికారి యుద్ధానికి వెళ్తున్నాడు. పండితుడు ఎదురుగా వెళ్ళి-

''దొరగారూ! గడ్డం మాసింది. మంగలివాడు రాలేదు. క్షవరం చేసి వెళ్ళండి'' అన్నాడు.

ఆ అధికారి కోపంతో ''ఓరీ తెలివితక్కువవాడా! ఇది యుద్ధంలో శత్రువులను నరికే కత్తి, దీనితో క్షవరం చేయాలా! పో!'' అని కసిరాడు.

''అయ్యా! అంత పెద్ద కత్తి ఉంది. క్షవరం చేయటానికి పనికిరాదా! ఎందుకు మోత బరువు. అవతల పడేయకూడదూ'' అంటూ నవ్వాడు పండితుడు.

అధికారి పండితుడిని తేరిపార చూసి ''భలేవారండీ! మాటకు మాట తీర్చుకున్నారన్నమాట! క్షమించండి'' అంటూ వెళ్ళిపోయాడు.

©$®